


# పిచ్చోణ్ణి చూడాలనుంది

**-దేవలపల్లి వీరయ్య**

నెల రోజుల నుండి ఎవరో వ్యక్తి ఇంటికి వస్తూ తన భర్త చుట్టూ తిరగడం నాగి గమనిస్తూనే ఉంది. ఆ వ్యక్తి ఎప్పుడు వచ్చినా తనకు విముఖంగా మసులుకోవడంకూడా గమని స్తూనే ఉంది. ఇంతవరకు ఎప్పుడూ ఆ వ్యక్తి ముఖాన్ని స్పష్టంగా చూడ లేదు నాగి. చూడాలని తహతహ లేదు. కాని, ఆ వ్యక్తి ఇంటికి వచ్చినప్పుడల్లా దిగ్భ్రాంతంగా ఉంటుంది నాగికి.

సాయన్న పిల్లనగ్రోయ్యి పాట మొదలు పెడతాడు. ఆ వ్యక్తి ఆసక్తిగా ముందుకు వంగి వింటాడు. వారి వంక నాగి దిగులు దిగులుగా చూస్తుంది. సాయన్న మై మరిచి పాడుతుంటాడు. ఆ వ్యక్తి ఒళ్ళు మరిచి ఊగుతుంటాడు. నాగి తన్మయించి పోతుంది. సాయన్న పాట ఆపడు. ఆ వ్యక్తి సాయన్న పాదాల మీద వాలిపోతాడు. నాగి ఒళ్ళు గగుర్పొడుచు కుంటుంది.

సాయన్న పాట వాపి, "పాట ఇట్లా పాడాలె" అని వివరించి చెప్పాడు.

"నీ కాళ్ళ్మొక్త, అది నా కివ్వు! నేను నేర్చుకుంటాను." ఆ వ్యక్తి ప్రాధేయ పడతాడు.

"ఇది నా ప్రాణం! దీ న్నెవరికీ ఇవ్వను. దీన్ని నా పెదవులు తప్ప ఇంకెవరి పెదవులూ తాకరాదు. ఇవి బజార్లో దొరుకుతాయి. మవ్వొకటి కొనుక్కొ చ్చుకో—పాట నేర్పే భారం నాదీ."

"నీ కడుపున పుట్ట, నేను కొనుక్కునే వరకు నీది నా కివ్వు." సాయన్న కడుపులో తల దాచుకుంటాడు ఆ వ్యక్తి.

కాళ్ళు కాలిన పిల్లిలా వంట గదిలో పచార్లు చేస్తుంది నాగి.

ఓ నాడు ఆ వ్యక్తిని సాగదోలి లోనికి వచ్చాడు సాయన్న.

అసలే బలహీనంగా ఉన్న సాయన్నను ఎప్పుడూ ఏదో ఓ రోగం అంటి పెట్టు కొని ఉంటుంది. ఈ మధ్య రోగమేం లేదు కాని, కాలి మోడి పుండు ఇంకా మానలేదు.

"సాయన్నా! నీ కాలి మోడి పుండుకు ఈగలు వాలడం చూస్తుంటే దుఃఖం వస్తుందిరా." గాద్గదిక స్వరంతో అంది నాగి.

నాగి ప్రవర్తన చూస్తుంటే సాయన్న హృదయం కరిగిపోయింది. ప్రేమగా ఆమె ముంగురులను సవరిం చాడు.

నాగి ఆనందం—సాయన్నకు తను కనచెమ్మ విలవాలన్నట్లు పొంగింది. బలహీనంగా ఉన్న సాయన్నకు కూలి పని చేతకాదు. ఆ ఊర్లో సాయన్న పాటను ఆదరించే వా రెవ్వరూ లేరు, రెడ్డిదొర ఆరేళ్ళ కొడుకు మురళి, నాలుగేళ్ళ కూతురు సంగీత తప్ప. ఆ పిల్లలు చాటుగా సాయన్నకు డబ్బు అంద జేస్తుం టారు.


"సాయన్నా! నేను కూలి పనికి పోతా(నా." అరమోడ్పు కళ్ళతో అంది నాగి.

"అంత అవసర మేం లేదు లేవే! రెడ్డి దొర నాకు పని ఇప్పిస్తా నన్నాడు. ఆయన పిల్లలు నా పాటంటే చెవులు కోసుకుంటారు"

రహస్యంగా నాగి—"నిజంగానా! పాటను ఎవ్వరికీ నేర్పకు—ఏం?" అంది.

"సరే" అన్నాడు, నాగిని దగ్గరకు లాక్కుంటూ.

"ఊఁ ..." బుంగమూతి పెట్టింది నాగి. "వాడెవడు?" దూరంగా జరిగి అలిగి కూర్చుంది. "నెల రోజుల నుండి మనింటికి వస్తూ నీ వెంట తగులు




సాయన్న హృదయాంతరాళంలో కలుక్కుమంది. నాగి మనసు కెలికినట్లయింది. "నా చొచ్చాడు... వాడికి నీ పాట నేర్పద్దు..."

సాయన్న విస్మితుడయాడు. "నాగీ, వాడు చాలా మంచోడు. వాడికి పాట నేర్పాలని అనిపిస్తుంది."

"వద్దు! వాడికి పాట నేర్పద్దు." మొండి కేసింది నాగి.

మారు మాట్లాడకుండా బయటికి నడిచి, పిలిచి వచ్చాడు సాయన్న. ఆ వ్యక్తి బయట అరుగు మీద కూర్చునే ఉన్నాడు.

నాగి ధైర్యం చేసి గుమ్మం దగ్గర కొచ్చి నిలుచుని, "ఏయ్, నువ్వెవరు?" అంది.

నాగి గొంతు విని ఆ వ్యక్తి గుమ్మం ముందు కొచ్చి నిలుచున్నాడు.

నాగి నాలుగడుగులు వెనక్కి వేస్తూ—"నువ్వెవరు అడుగుతుంటే మాట్లాడ వేంది?" అని రెట్టించింది.

ఆ వ్యక్తి నాలుగడుగులు ముందుకు నడిచి, చేతులు జోడించి, "మాది మెదకు" అని తడబడుతూ అన్నాడు.

"మా ఇంటికి రావద్దు." ఆజ్ఞాపిస్తున్నట్టు అంది.

"సాయన్న దగ్గిర పాట నేర్చుకోవాలని వచ్చిన. కాల్మొక్త నన్ను కొట్టకు. మీకు ఋణపడి ఉంటాను."

"అదేం వద్దూ... మా ఇంటికి రావద్దంతే."

[illegible]

"లోపలికి వస్తావేందుకు? బయటికి నడువు!"

గొంతు మారించుకున్నా డతడు. "సాయన్నతో వస్తుంది... నీతో కాదు. ఆయన వెళ్ళగొడితే పోతా."

"అంటే?"

"అంతే!"

"ముండాకొడకా! మా ఇంటి కొచ్చి నన్నే రెచ్చ కొడతావా!" బుస్సుమంది నాగి.

వేగిరం నడిచి, "ఏంటి... నేను దొంగ ముండాకొడుకునా?" అంటూ చెయ్యెత్తాడు. అంతలోనే తమాయించుకున్నాడు.

నాగికి పట్టరాని కోపం వచ్చింది. పక్కనే కనిపించిన కొడవలి అతని వైపు విసిరింది. ఆ కొడవలి అతని పిలమండకు తగిలి గాయ మేర్పడింది. రక్తం కారుతూంది. "అబ్బా!" అంటూ హడలిపోయి, గాయాన్ని చేతో ఒత్తి పట్టుకున్నాడు.

అతని కళ్ళు నీటితో నిండిపోయాయి.

నాగి బిత్తర పోయింది. తదేకంగా చూస్తూం డతణ్ణి!

ఇంతలో సాయన్న వచ్చాడు.

ఆ వ్యక్తి రక్తం, కన్నీరు బయట పడకుండా జాగ్రత్త పడుతున్నాడు. "సాయన్నా! నీ కాల్మొక్త... నాకు పాట నేర్పు" అంటూ ప్రాధేయపడుతున్నాడు.

సాయన్న సరాసరి లోనికి నడిచి అరోలా కూర్చున్న నాగిని కుదిపి, "రెడ్డిదొర పిల్లలు నన్ను రమ్మంటున్నారు. నా పాట కోసం బెంగ పెట్టుకున్నారట—పోతున్నా" అన్నాడు.

"ఏమో? నాకు భయం భయంగా ఉందిరా, సాయన్నా" అంది నాగి శుష్కించిన స్వరంతో.

నాగిని మనసారా ఓదార్చ పూనుకున్నాడు సాయన్న. "ఎందుకు భయం? నేను బయటికి పోతున్ననా?" అని అడిగాడు జాలిగా.

"ఉహూఁ... కాదు."

"ఓహో—అదా? వాడికి ఇప్పుడు పాట నేర్పనులే!"

"ఉహూఁ... అదీ కాదు." వెక్కి వెక్కి ఏడవ సాగింది నాగి.

సాయన్న కేం మనసుకు పట్టడం లేదు! ఆ వ్యక్తి పాట మొదలు పెట్టాడు. ఆ పాట శ్రుతి తప్పింది. సాయన్న మనసు అటు దొర్లింది.

* * *

"సాయన్న లేడు." పిట్ట గోడ కానుకుని తొంగి చూస్తూ అంది నాగి.

ఆ వ్యక్తి మారు పలకకుండా వెను తిరిగి పోబోయాడు. అతని కాలి పిలమండకున్న గాయం నుండి చీము కారుతూంది.

"ఏం పేరు నీది?" తడబడుతూ అడిగింది నాగి.

"నరహరి... కాల్మొక్త" అంటూ చేతులు జోడించాడు.

"సిరిహరా?"

"కాదు, నరహరి."

ఎందుకో నాగి కాళ్ళు నిలవడం లేదు. గుండె వేగం హెచ్చింది. మెల్లగా నరహరి దగ్గరకు నడిచింది. నరహరి పిలమండకు తన వలన ఏర్పడిన గాయాన్ని తాకింది! 'పాపం!' అనిపించింది నాగికి. చీమును వేలితో తుడిచి వేసింది.

నరహరి చేతులు నాగి భుజాలను పట్టుకున్నాయి. నాగి గుండె ఝల్లుమంది! రెండు పాములు తనను పైకి లేపుతున్నట్లు అనిపించింది! నాగిని హత్తుకున్నాడు నరహరి!

ఒళ్ళంతా తిమ్మిరెక్కింది నాగికి. సాయన్న పొగ మంచులో కలిసి పోతున్నట్లు అనుభూతి కలుగుతూంది.

నరహరి నాగి బుగ్గలను చుంబించి, "పద" అన్నాడు!

అప్పుడే తను గొంతు వరకు ఊబిలో దిగిపోయినట్లు కలవర పడుతూంది నాగి. కన్నీరు కట్టలు తెంచుకుని ప్రవహిస్తూండగా "సాయన్నకు కనిపించకూడదు" అంటూ పిచ్చిగా పది సార్లు అరిచింది.

* * *

నాగి కోసం ఊరంతా గాలించాడు సాయన్న. ఎక్కడా కనిపించకపోగా దిగులు పడిపోయాడు. మనసు చంచలమై పోయింది. వాడిపోయిన పువ్వులా వేలాడుతూంది సాయన్న మెడకు పిల్లనగ్రోవి. లేడి చూపులతో, 'సాయన్నా! నన్ను కొట్టురా! కొట్టి పిల్లనగ్రోవ్యాసు పాడు—అప్పుడు హాయిగా నిద్ర పోతాను ... ఏం?' అన్న నాగి మాటలు గుర్తుకు వస్తూంటే దుఃఖంతో గొంతు పూడుకు పోతుంది. నాగి 'సాయన్నా! నేను పామును మెడకు వేసుకుంటాను. నువ్వు పాట పాడు... ఆట ఆడదాం... చూసే వారు డబ్బులు వేస్తారు... హాయిగా బతుకుదాం... ఏంరా?' అంటే, తను నవ్వి ఊరుకునే వాడు. తన కలలు పెళ్ళాం దొరుకుతుందా అని కొన్నేళ్ళపాటు దిగులు చెందిన వాడు అంత తొందరగా పెళ్ళాం మాటలను ఎట్లా త్రోసిపుచ్చ గలిగాడో అంతకన్నా వేగంగా కాలాన్ని హరించి వేశాడు. ఇప్పుడు కాలం స్తంభించి పోయింది. సంధ్య వేళ అయింది. చీకట్లు ముసురు కుంటున్నాయి. కుబుసం లాంటి నాగి చీర కనిపించింది. నాగి స్మృతులు మనసును కెలుకుతుండగా, గొంతులో దుఃఖం నాట్యం చేస్తుండగా, ఆ చీరలో తల దాచుకుని శోక సముద్రంలో తేలియాడ సాగాడు. ఇంట్లో దీపం వెలిగించ చేత కాలేదు. చీకట్లతో పోరాడ ధైర్యం లేదు. రెడ్డి దొర ఇంటికి పరుగు తీశాడు.

రెడ్డిదొర ఆశ్రయ మిచ్చాడు. తెల్లవారింది. ఎవరి పనుల్లో వారు నిమగ్నులై ఉన్నారు. రాత్రంతా నిద్ర




పైన బొమ్మ
చిత్రం—ఎస్. గ. కృష్ణబాబు (ఒంగోలు)

లేమి వలన కళ్ళు ఎర్రబడి ఉన్నాయి. మనసంతా పొగమంచుతో నిండి పోయింది. కాళ్ళు ముదురుకొని కూర్చున్నాడు.

రయ్యిన పరుగెత్తుకొని వచ్చి సాయన్న ముందు నిలుచుని, "నన్ను ముద్దు పెట్టుకుంటావా?" అనడిగింది అరిందాలా సంగీత.

ఆ పిల్లను చూస్తూంటే సాయన్న అవతలి గట్టున ఉన్న తల్లి కోసం లేడూడ పీటిని ఈదుకుంటూ వస్తున్నట్లు, పొగమంచును ఛేదించుకుంటూ వచ్చింది. ఆ పిల్లను ఒళ్ళోకి తీసుకుని తనివితీరా ముద్దు పెట్టుకుంటుండగా సాయన్న నేత్రద్వయం నుండి నాలుగు కన్నీళ్ల బొట్లు రాలి, ఆ పిల్ల లేబుగ్గల మీది గుండా జారిపోయాయి.

గవ్వల్లాంటి కళ్ళతో పొడిచి పొడిచి చూస్తూ, "ఏడుస్తున్నావా?" అనడిగింది సంగీత. "ఉహూ. . . ఆనందం వస్తుంటే కళ్ళలో నీళ్ళు ఊరినాయి" అన్నాడు సాయన్న. ఆ పిల్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలో అర్థం కాకుండా ఉందాయనకు. పక్క జేబులోంచి పది పైసలు తీసి సంగీత కివ్వబోయాడు. "ఉహూ. . . డబ్బులొద్దే వద్దు. . . ఆ పాట పాడంతే. . . నా దగ్గరే డబ్బులున్నాయి" అంది ముద్దు లొలికే మాటలతో.

పాటను మరిచిపోయి యుగాలు గడిచినట్లు అనిపిస్తూండగా పిల్లనగ్రోవిని పెదవుల ముందుంచుకున్నాడు సాయన్న. పల్లవికి ముందు రెండు క్షణాలు గడువు తీసుకున్నాడు. ఆ గడువులో శక్తినంతా కూడదీసుకున్నాడు. సంగీతను కనక ఆనంద డోలికల్లో ముంచెత్తకుంటే తన జీవితం వృథా అనుకున్నాడు.

పాట మొదలు పెట్టాడు. ఆ పాట కోయిల గళం చించుకుని పాడుతూందా? అనిపించింది, లోపల ఉన్న మురళికి. అన్నం ముందు నుంచే లేచి వచ్చాడు. శాంతమ్మకూడా వంట పని వదిలేసి వచ్చింది. ఆమెకూడా తన్మయత్వం పొందింది. "సాయన్నా, ఇక చాలు! ఈ నాటి నుండి మా ఇంట్లోనే పిల్లలను ఆడిపించుకుంటూ ఉండాలె. . . నీకు కొదువేం లేకుండా చేస్తాం" అంది. పాటను ఆపిన సాయన్న—"అంతకన్నా నా కేం కావాలె, తల్లీ!" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు.

ఆ పిల్లలతో సాఫీగా సంవత్సరం గడిచిపోయింది. బలహీనం వలన సాయన్న కాళ్ళకు నంజు వచ్చింది. నంజు మీద పుండ్లుకూడా ఏర్పడినాయి. ఆ పుండ్ల మీద ఈగలు వాలడం చూస్తుంటే రెడ్డిదొరకి పిల్లలను సాయన్న నుండి వేరు చేయా లనిపించింది. వారం రోజుల కల్లా అనుకున్నంత పని చేశాడు రెడ్డి దొర. సాయన్నకు చేను కావలి అప్పగించాడు.

ఆ రాత్రి మెలకువ వచ్చింది సాయన్నకు. చుట్టూ కలియ చూశాడు. కటిక చీకటి! చేనంతా రహస్యంగా ముక్కలు నేర్చే పాఠాలు వింటున్నట్లుంది. ఇప్పుడు గనక తన దగ్గరకు పాము వస్తే? అమ్మో! తలుచుకో కూడదు! నిండా కప్పుకుని నిద్ర కోసం తపస్సు చేస్తున్నాడు.

అది సుషుప్తో, స్వప్నమో తెలియని అవస్థ. ఎంత అందంగా ఉందా పాము? ఎంత నాజూగ్గా మెలికలు తిరుగుతూ నడుస్తూంది! పాట పాడి, దాన్ని తన స్వంతం చేసుకుంటేనో? వెంటనే పాట మొదలు పెట్టాడు సాయన్న. పాము ఆగిపోయింది. చటుక్కున పడగ విప్పింది. పడగను అటు, ఇటు తిప్పుతూ సంగీత తరంగాలు ఎక్కడినుంచా? అని పరికించింది. చివరగా సాయన్న వేపు ముఖం పెట్టింది. ఆనంద డోలికల్లో ఊగిపోతూంది. పరవశించి పోతూంది. ఒయ్యారంగా సాయన్న వేపు నడుస్తూంది. పాముకు విషంకూడా ఉంటుంది కదూ? పాటను ఆపాడు సాయన్న. అంతటితో పాముకు కోపం వచ్చిందో, లేక సంగీత కోవిదుణ్ణి బతిమాలా లనిపించిందో, నడకను హెచ్చించింది. భయకంపితుడైన సాయన్న పారిపోబోయాడు. కాని, కాళ్ళు రావడం లేదు. కాస్సేపటికి తనకు కాళ్ళే లేవని తెలిసింది. పెద్దగా అరిచాడు. మెలకువ వచ్చింది. ఇంక అక్కడ క్షణం నిలవలేక పోయాడు. రెడ్డిదొర ఇంటికి పరుగు తీశాడు. రెడ్డిగారితో నిజంగానే చేలో పాముందని అబద్ధమాడాడు.

"చవటా! అడవి పందిని తరమనూ లేవు, ఒక్క పామును చంపనూ లేవు. పో మా ఇంటినుండి!" హెచ్చరించాడు దొర.

పిల్లలను, శాంతమ్మను, ఆ ఇంటిని మరిచి వెళ్ళిపోక తప్పింది కాదు సాయన్నకు. ఉండగలిగి నన్నాళ్ళు ఆ ఊర్లోనే ఉన్నాడు. ఆకలి సాయన్నను ఊర్లు తిప్పించింది.

ఓ నాడు భిక్షం అడుక్కోవటానికి కూడా ధ్వని అంతగా చాలింది కాదు. బాగా ఆలోచించి, నటించడానికి పూనుకున్నాడు. గుడ్డివానిలా కనిపించాలని కంటి పాపలకు ఏవో తెల్లటి వస్తువులను అమర్చుకున్నాడు. చౌరస్తాలో కూర్చున్నాడు. తన ముందు ఓ గుడ్డను పరుచుకున్నాడు. పిల్లనగ్రోవిని వాయించడం మొదలు పెట్టాను. కొంత సేపటికి జనం మూగారు. సాయన్న పాటకు ముగ్ధులై డబ్బులు వేయసాగారు. 'గుడ్డివాడైనా ఎందరిని, ఆనంద పరుస్తున్నాడు!' అంటూ ప్రశంసించ సాగారు. కాస్సేపటికి ఊపిరి నశించి, పాటను ఆపాడు. జనం చెదిరి పోయారు. గుడ్డను ముదురుకుని కొంత దూరం నడిచి మలుపు తిరిగాడు. అక్కడ కూర్చుని కళ్ళకు అమర్చుకున్న వస్తువులను పెరికివేశాడు. 'అబ్బ ! ఎంత డబ్బు!' అనుకున్నాడు. ఆ దృశ్యం ఓ పిల్లవాడు చూచి, సరదాపడి, కాకిలా అరిచాడు. మళ్ళీ జనం మూగారు సాయన్న చుట్టూ. 'నీ కళ్ళను గుడ్డివిగా చేసుకుని, మా కళ్ళను కప్పి వేస్తావు(ట్రా?' అంటూ చావ బాదారు. ఇందాక తాము వేసిన డబ్బులే. కాక, పిల్లనగ్రోవినికూడా లాక్కున్నారు.

కాళ్ళు చీముతో తడిసిపోయినాయి. కళ్ళు తిరుగుతున్నాయి. కడుపు కాలుతూంది. ఒళ్ళంతా మంటలు రేగుతున్నాయి.

నాయనమ్మ సమాధి మీద పడుకొని, 'పాము లేకుండా పాట పాడినందుకు పిల్లనగ్రోయ్యను లాక్కుం దీ లోకం, నాయనమ్మా' అని ఏడవాలనే కోరికే సాయన్నను కొన ఊపిరితో నిలబెట్ట గలుగుతూందేతప్ప జీవచ్ఛవంలా ఉన్నాడు.

ఆ దారి ఎటు పోతుందో కాని, సాయన్న తన నాయనమ్మ సమాధి వేపే అనుకుంటున్నాడు.

ఇంతలో అనుకోకుండా నాగి కనిపించింది సాయన్నకు. కాని, చంకలో బిడ్డ, మెడలో తులం, మాసం బంగారం. 'ఉహూ. . . తన నాగి అలా ఉండదు' అనుకుంటూ ముందుకు అడుగు వేశాడు.

నాగి, నాగి పక్కనే నడుస్తున్న నరహరి సాయన్నను చూశారు. కాని, పిట్టగూడులా చెదిరి ఉన్న గెడ్డం, చిందర వందరగా ఉన్న జుట్టు, పీక్కుపోయి ఉన్న కళ్ళు, చీము కారి అసహ్యంగా ఉన్న కాళ్ళు, చింకి పాంటు... 'ఉహూ... సాయన్న కాదు' అనుకుంది నాగి, నరహరికూడా!

'సాయన్నా! నీ కాలి మీది పుండ్లు చూస్తూంటే దుఃఖం వస్తుందిరా.' నాగి ఆగిపోయింది. 'ఆ పోయేటతను ఎవరు?' గొణిగింది. "ఏహే పిచ్చోడులే!" అంటూ నాగి జబ్బను ముందుకు నెట్టాడునరహరి.

"కాదు, పిచ్చోడు కాదు. . . పిచ్చోడు కానే కాదు" అంటూ మొండికేసింది నాగి. నరహరి 'ఇక లాభం లే'దని తన్నాడు, కొట్టాడు. అయినా, నాగి "అయినా సరే, పిచ్చోణ్ణే చూడాలనుంది" అంటూ కేకలు వేస్తూంది. నలుగురు మూగారు. నాగిదే తప్పంటున్నారు. నాగి రక్తం కక్కుకుంది! అయినా, "పిచ్చోణ్ణే చూడాలనుంది" అనే మాటను మానుకోనడంలేదు. ✱